## బీఆర్ఎస్ పటిష్టతకు పాటు పడుతున్నాం



విలేకరులతో మాట్లాడుతున్న నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్, నవంబర్ 8 : ఎనిమిదేండ్లుగా బీఆర్ఎస్ పటిష్టతకు పాటు పడుతున్నామని నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. బుధవారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. దళితవాడలో బస కార్యక్రమం నిర్వహించి సమస్యల పరిష్కరించామన్నారు. మెగా జాబ్‌మేళా నిర్వహించి 4800 మందికి ఉద్యోగాలు ఇప్పించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. నిరుపేద విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ, పీజీ కోర్సుల్లో బోధన అందేలా అడ్మిషన్లు ఇప్పించడం జరిగిందన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు నాయకత్వంలో పార్టీని మరింత పటిష్ట పర్చేందుకు పాటు పడుతున్నామన్నారు.

## గోషామహల్‌లో నామినేషన్లు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు ఇస్తున్న సునీతారావు

అబిడ్స్, నవంబర్ 8 : నామినేషన్ల దాఖలు గడువు ఈ నెల 10 న ముగియనుండడంతో బుధవారం నలగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ భవనంలో వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విక్టర్‌కు పత్రాలు అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా మొగిలి సునీత, ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థిగా బోనాల శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా లింగస్వామి సింగారం, స్వతంత్ర అభ్యర్థిగా పెద్ద మ్యాతరి అనిల్ తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి దాఖలు చేశారు. మొదటి రోజు రెండు నామినేషన్ పత్రాలను దాఖలు చేయాల్సి ఉండగా, రెండోరోజు ఒక నామినేషన్, మూడోరోజు మూడు, నాల్గవ రోజు ఐదు, ఐదోరోజు నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బుధవారం నాటికి మొత్తం 16 నామినేషన్ పత్రాలు దాఖలు కాగా 13 మంది ఉన్నారు.



గన్‌ఫౌండ్రి డివిజన్‌లో కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాశ్ భీష్వతో కలిసి బుధవారం గోషామహల్ బీజేపీ అభ్యర్థి టి.రాజాసింగ్ పాదయాత్ర చేసి ప్రచారాన్ని చేపట్టారు. గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండు యాదవ్, గోవింద్‌రాఠిలతో కలిసి ఆయన ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ప్రజలు సన్మానించారు. కార్యక్రమంలో మంగళ్‌హాట్ కార్పొరేటర్ ఎం.శశికళ కృష్ణ, నరహరి పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 8**



కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ బాపూనగర్‌లోని ఆరెకటిక శ్మశాన వాటికలో బుధవారం సంఘం ప్రతినిధులు పరిశుభ్రత పనులను చేపట్టారు. దీపావళి సందర్భంగా పితృదేవతలకు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా బుధవారం సంఘం అధ్యక్షుడు ధరంకార్ బందులాల్ నేతృత్వంలో పనులను చేపట్టి పూజలు చేశారు. **- మెహిదీపట్నం, నవంబర్ 8**

# ప్రజల సహకారంతో విజయం సాధిస్తాం



సన్మానం అనంతరం మాట్లాడుతున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్, నవంబర్ 8 : ప్రజల సహకారంతో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థిగా ఆయన పేరును ఖరారు చేయడంతో వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్, నాయకులు వ్యాస్‌ను బుధవారం సన్మానించి అభినందనలు తెలిపారు. నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకు వెళ్లి ప్రచారాన్ని చేపట్టి విజయం సాధిస్తామన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యత కల్పిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేసిందని వివరించారు. తొమ్మిదిన్నర సంవత్సరాలలో ఏ మాత్రం అభివృద్ధి ఇక్కడ జరుగలేదని, తమ ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు పాటు పడ్తామన్నారు. అంతే కాకుండా ప్రజలకు పౌర సదుపాయాలను మెరుగు పర్చేందుకు కృషి చేస్తామన్నారు. వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ వహీద్ అహ్మద్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలను ఇంటింటా ప్రచారం చేసి ప్రజల సహకారంతో ఘన విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌నాయకులు ఫహీం పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో భారీగా దాఖలు కానున్న నామినేషన్లు

అబిడ్స్, నవంబర్ 8 : నామినేషన్ల దాఖలుకు రెండు రోజులు మిగిలి ఉండడంతో గోషామహల్, నాంపల్లి, కార్వాన్ నుంచి గురు, శుక్ర వారాల్లో భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు కానున్నాయి. గోషామహల్ నుంచి ప్రధాన పార్టీలైన బీజేపీ అభ్యర్థి టి.రాజాసింగ్, కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీత ఇప్పటికే నామినేషన్ దాఖలు చేయగా బీఆర్ఎస్ అభ్యర్థిగా నందకిశోర్ వ్యాస్ బిలాల్ శుక్రవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలు దేరి అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి విక్టర్‌కు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వ్యాస్ తెలిపారు. గురువారం సాదా సీదాగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కార్వాన్ కాంగ్రెస్ అభ్యర్థి బుధవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ గురువారం సాదా సీదాగా ఒక సెట్ పత్రాలను దాఖలు చేయనుండగా శుక్రవారం భారీ ర్యాలీతో మరో సెట్ దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్వాన్ బీజేపీ అభ్యర్థి ఠాకూర్ అమర్‌సింగ్ నామినేషన్ పత్రాలను గురువారం తాళ్లగడ్డ హనుమాన్ ఆలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. దర్బార్ మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా బయలు దేరి కార్వాన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. నాంపల్లి నియోజకవర్గం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా మహ్మద్ మాజిద్ హుస్సేన్ ఇప్పటికే నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫెరోజ్‌ఖాన్ నామినేషన్ పత్రాలను దాఖలు చేయాల్సి ఉన్నది. నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ నాంపల్లి ఏడు గుళ్ల పోచమ్మ ఆలయం నుంచి ర్యాలీగా బయలు దేరి ఆసిఫ్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మూడు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నట్లు తెలిపారు. నాంపల్లి ఏడు గుళ్ల పోచమ్మ ఆలయం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిని ఆ పార్టీ ఇంకా ఖరారు చేయక పోవడంతో పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత శుక్రవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అవకాశాలు ఉన్నాయి.

### పలు ప్రాంతాల్లో
## నేడు నీటి సరఫరా బంద్

అబిడ్స్, నవంబర్ 8 : అల్లబండ రిజర్వాయర్‌లో మరమ్మతుల కారణంగా గోడేకి ఖబర్ జలమండలి సెక్షన్ పరిధిలో గురువారం కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు గమనించాలని సెక్షన్ మేనేజర్ గురునాథ్ తెలిపారు. జుంగుర్ బస్తీ, శివానంద్ హోటల్, అంబేద్కర్ నగర్, దేవీ నగర్, గోషాకట్, చుడీ బజార్, గౌలి బస్తీ, పార్ధీవాడ ప్రాంతాల్లోసరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలకు సహకరించాలని జలమండలి అధికారులు కోరారు.

## విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా

మెహిదీపట్నం, నవంబర్ 8 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో11 కేవీ విజయ్‌నగర్ కాలనీ ఫీడర్ విజయ్‌నగర్ కాలనీ బస్‌స్టాప్, విజయ్‌నగర్ కాలనీ ఫుడ్ వరల్డ్, లక్కీ కిరాణ అండ్ జనరల్ స్టోర్, మిల్క్ బూత్ ఓల్డ్, న్యూ, 11 కేవీ పి.ఎస్. నగర్ ఫీడర్ హాకీ గ్రౌండ్, పీఎస్ నగర్, మాసాబ్‌ట్యాంక్, యూనివర్సల్ బేకరి, ఆంధ్రాబ్యాంక్, జేఎన్‌టీయూ వెనక వైపు, శాంతినగర్, క్యాస్టిల్ హిల్స్, ఎన్ఎండీసీ, విజయ్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1: 30 గంటల వరకు,11 కేవీ అఫ్జల్‌సాగర్ ఫీడర్ బడీ మసీద్, ఫుట్‌బాల్ గ్రౌండ్, జాఫర్ గ్రౌండ్, అన్వరులూం కాలేజ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

## విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



11న పేరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే విశ్వరూప మహా సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఇందిరానగర్‌లో ఆదిజాంబవ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద మాదిగ కులస్తులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణ మాదిగ ప్రధాని మోడీ ముఖ్య అతిథిగా హాజరై వర్గీకరణ విషయంపై మాట్లాడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదిజాంబవ సంక్షేమ సంఘం ప్రతినిధులు కేశవ్, సురేశ్, కుమార్, చెన్నయ్య, వెంకటేశ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చంద్రమోహన్ మాదిగ, మిరియాల నవీన్‌కుమార్ మాదిగ పాల్గొన్నారు. **- జియాగూడ, నవంబర్ 8**

## కార్మికుడిపై దాడి

మెహిదీపట్నం, నవంబర్ 8 : విద్యుత్ మీటర్ రీడింగ్‌కు వెళ్లిన కార్మికుడిపై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన హుమాయూన్‌నగర్ పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాబ్‌ట్యాంక్ పరిధిలోని అహ్మద్‌నగర్, బడాబజార్‌లో ఓ ఇంటి వద్దకు బుధవారం మధ్యాహ్నం విద్యుత్ కార్మికుడు మహ్మద్ ఆసిఫ్ మీటర్ రీడింగ్ కోసం వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి ఓ వ్యక్తి బయటకు వచ్చి ఆసిఫ్‌ను దూషిస్తూ దాడి చేసి కొట్టాడు. ఈ ఘటనకు వీడియోతో సహా ఆధారాలను ఇస్తూ తనపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆసిఫ్ హుమాయూన్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బలమైన శక్తిగా బీఆర్ఎస్..

కాచిగూడ, నవంబర్ 8: అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ బలమైన శక్తిగా ఉన్నదని, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులంతా బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారని ఆ పార్టీ గోల్నాక డివిజన్ మాజీ అధ్యక్షుడు భరత్‌రాజ్ ముదిరాజ్ అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం గోల్నాక డివిజన్ తులసీరాంనగర్, గంగానగర్, తదితర ప్రాంతాల్లో బస్తీల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అంబర్‌పేటను అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను భారీ మెజార్టీతో రెండో సారి గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గండికోట జనార్దన్, కాలేరు రామకృష్ణ, శేషుపేరి, సురేశ్‌గౌడ్, నర్సింగ్‌యాదవ్, రాజన్, సతీశ్, గోపాల్, మోబిన్, యూసుఫ్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.



గంగానగర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు భరత్ ముదిరాజ్, జనార్దన్, తదితరులు